క్లుప్తంగా

మల్లన్న తలపాగాకు పూజలు



తలపాగకు పూజలు చేస్తున్న భక్తులు

రాజాం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల మల్లన్నకు సమర్పించే తలపాగాకు పట్టణంలోని మల్లికార్జునకాలనీలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సంతమార్కెట్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో తలపాగాకు పూజలు చేశారు. అనంతరం కాలనీలో తిరువీధి నిర్వహించారు. కాలనీకి చెందిన చల్లా జయరాం, రమ, చల్లా షణ్ముఖరావు, పావని నెలరోజుల పాటు నిష్ఠగా దీన్ని నేత చేశారు. శివరాత్రికి ఈ తలపాగాను శ్రీశైలం మల్లన్నకు సమర్పిస్తున్నట్లు జయరాం తెలిపారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న కమిషనర్ రామఅప్పలనాయుడు

రాజాం సిటీ: 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు అన్నారు. మున్సిపాల్టీ పరిధి మిర్తిరెడ్డి సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఆస్పత్రికి వెళ్లలేని రోగులు గ్రామంలో అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు, వైద్యులు అనూష, ప్రవీణ, శైలజ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అధునాతన యంత్రపరికరం



పీహెచ్‌సీలో రక్తపరీక్షల యంత్రాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

రేగిడి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల బ్లడ్ టెస్టులు చేసేందుకు అధునాతన పరికరం మంజూరైందని వైద్యులు అసిరినాయుడు, సోహినీరాఘవ్ తెలిపారు. బుధవారం ఈ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ యంత్ర సాయంతో 63 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించవచ్చన్నారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రమణ, స్టాఫ్ నర్సు యశోద, యూడీసీ జగదీష్, సీహెచ్‌ఎస్ కృపాలిని, సూపర్‌వైజర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామోపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. స్థానిక హైస్కూల్‌లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పనిచేస్తున్న వ్యాయామోపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు క్రీడల్లో శిక్షణ ఇచ్చి వారిని ఉత్తమ పౌరులుగా, క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతీ నెల నిర్వహించే శిక్షణ కార్యక్రమాలను వ్యాయామోపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్దివలస పాఠశాల తనిఖీ



బోధన తీరును పరిశీలిస్తున్న ఎంఈఓ

వంగర: మండలంలోని మద్దివలస ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ వై.దుర్గారావు బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వలంటీర్లే సంక్షేమ వారధులు



తెర్లాం: అవార్డులకు ఎంపికైన వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



వంగర: వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ వారధులు వలంటీర్లని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లను పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. తమకు కేటాయించిన క్లస్టర్ పరిధిలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా వలంటీర్లు వారి కుటుంబ సభ్యుల్లా తోటుంటున్నారని అన్నారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలు యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షులు వంజరాపు విజయ్‌కుమార్, పాలవలస గోపి, మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, మేనేజర్ నాగరాజు, పార్టీ కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు, అధికార ప్రతినిధి ఆసపు సూర్యం, ఆర్నిపల్లి వెంకటనాయుడు మాస్టారు, దూబ గోపాలం, రేజేటి జయరాం మాస్టారు, అల్లెన జయలక్ష్మి, పిట్టా జగదీష్, కోరాడ రామినాయుడు, చల్లా జయరాం, పిచ్చుక శ్రీనివాసరావు, జి.బాబూరావు, కలమట శంకర్, పాలవలస శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వంగరలో..

వంగర: ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లదే కీలకపాత్ర అని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వారు పాల్గొని పురస్కారాలు అందుకున్న వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు సముచిత స్థానం ఇచ్చారన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలు ఎవరూ నమ్మొద్దని, ఎల్లోమీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు, సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షురాలు మరిశర్ల విజయలక్ష్మి, తహసీల్దార్ కమలపాటి సుధాకర్, ఎంపీడీఓ ఎం.వి.బాలసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాజాం: బుచ్చింపేట వార్డు వలంటీర్ శారదను సేవారత్న అవార్డుతో సత్కరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డాక్టర్ తలే రాజేష్, తదితరులు

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం: ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని, నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లను సేవా పురస్కారాలతో సత్కరించడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు పారదర్శకంగా అందుతున్నాయంటే అందుకు కారణం గ్రామ, వార్డు వలంటీర్లేనని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వలంటీర్లంతా సైనికుల్లా పనిచేసి వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం నాయకుడు శంబంగి శ్రీకాంత్, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, వైస్ ఎంపీపీ ప్రతినిధి అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ బోను అప్పలనాయుడు, సీనియర్ నాయకులు నర్సుపల్లి బాబ్జీరావు, మర్రాపు జగన్నాధం, ఎంపీడీఓ మధుసూదనరావు, తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి, ఎంఈఓ త్రినాథరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాం సిటీ: రాజాం మండల పరిధిలో సేవలందిస్తున్న వలంటీర్లను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం సత్కరించారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కె.శ్రీరంగం నాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, సామంతుల వెంకటప్పలనాయుడు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



రాజాం సిటీ: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

- బొబ్బిలి రాజులకు సవాల్ విసిరిన ఎమ్మెల్యే శంబంగి



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: బొబ్బిలి నియోజకవర్గ అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో రాజులు చర్చకు సిద్ధమా? చర్చావేదిక ఎక్కడన్నది వారిష్టమేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బేబీనాయనకు సవాల్‌విసిరారు. స్థానిక క్యాంపు కార్యాయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013లో బొబ్బిలి మెయిన్‌రోడ్డు విస్తరణ కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రస్తుత మంత్రి బొత్ససత్యనారాయణ మంత్రిగా ఉంటూ రూ.10.5 కోట్లు నిధులు మంజూరుచేయిస్తే విస్తరణ పనులు చేయకుండా ఉండిపోయారన్నారు. తెర్లాం మండలం లొచర్ల, బొబ్బిలి మండలం రాముడువలసలలో ఎత్తిపోతల పథకాలు, పారాదిలో వేగావతి నదిపై వంతెన తామే మంజూరు చేయించామని శిలాఫలకాల వేసి గొప్పలు చెప్పుకుంటున్నారని, దమ్ముంటే వాటి మంజూరు పత్రాలను విలేకరుల ముందు చూపించాలన్నారు. ప్రజలు చాల తెలివైనవారని ఎవరు ఏం చేశారో వారికి తెలుసునని అన్నారు. బొబ్బిలిలో వచ్చే ఎన్నికలలో తాను 15వేల ఓట్లమెజ్జాతో తప్పక గెలుస్తానని దీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు టీడీపీ హయాంలో ధాన్యం బిలుల బకాయిలు రూ.90 కోట్లకుపైగా ఉండిపోతే తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత సీఎంతో చెప్పి వారికి రూపాయి బాకీ లేకుండా తీర్చామన్నారు. బొబ్బిలి మండలం అలజంగి నుంచి పూడి చిన్నారావు ఆధ్వర్యంలో వాస్తవంగా 50 కుటుంబాలు టీడీపీని వీడి ఇక్కడకు వచ్చి పార్టీలో కలిసిపోతే కాదని తప్పుడు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో ఆయనతో పాటు అలజంగికి చెందిన పూడి చిన్నారావు, ఒకటో వార్డు కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు, తమ్మిరెడ్డి దామోదరరావు, జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ పక్కా ఇళ్లు



జగనన్న కాలనీలో గృహప్రవేశాలను ప్రారంభిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: జగనన్న ఇంటి పథకంతో చాలా మంది పేదలు సొంత ఇంటికి యజమానులుగా మారుతున్నారని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. రాజాం మున్సిపాల్టీ పరిధి కంచరాం సమీపంలో జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తయిన ఇళ్లలో బుధవారం సామూహిక గృహప్రవేశాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజేష్ మాట్లాడుతూ.. నిరుపేదల సొంతింటి కలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్ద సంఖ్యలో ఇళ్లు మంజూరు చేయలేదని అన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, చింతా సత్యనారాయణ, గంధవరపు సురేష్, కె.శ్రీనివాసరావు, కనుగు ఇస్సాక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



వన్నలిలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సోహినీరాఘవ్

రేగిడి: ప్రజారోగ్య సంరక్షణే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సోహినీరాఘవ్ అన్నారు. మండలంలోని వన్నలి గ్రామంలో బుధవారం 104 ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అనారోగ్య లక్షణాలతో బాధపడుతున్న పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సోహినీరాఘవ్ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఇందులో 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు 64 రకాల మందులు అందిస్తున్నట్లు చెప్పారు. వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియ, ఏఎన్‌ఎం రాజేశ్వరి, సర్పంచ్ గార రమణ, ఆశా వర్కర్లు రాములమ్మ, సావిత్రి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ



సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బాడంగి: మండలంలోని కామన్నవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన రామ మందిరం ప్రతిష్ఠామహోత్సవాలు మూడురోజుల పాటు ఘనంగా జరిగాయి. బ్రహ్మశ్రీ చల్లపిల్ల రామావతారం శర్మ, గ్రామ పురోహితుల ఆధ్వర్యంలో బుధవారం మండప పూజ, ఆలయ శిఖర యంత్రప్రతిష్ఠ, బింబ దర్శనం, పూర్ణాహుతి, తదితర పూజా కార్యక్రమాలు, సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట జిల్లా జేసీఎస్ కన్వీనర్ శ్రీకాంత్, స్వామి అంతర్ముఖానంద, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, బి.శంకరరావు, జి.స్వామినాయుడు తదితరులు ఉన్నారు.

సంఘాల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

రేగిడి: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఏపీఎం పి.గోవిందరావు అన్నారు. మండలంలో ఆమదాలవలసలో బుధవారం గ్రామైఖ్య సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల పొదుపు రికార్డులు పరిశీలించారు. పొదుపు నిల్వతో పాటు స్త్రీనిధి రుణాలు వినియోగం, చెల్లింపుపై ఆరాతీశారు. రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు, సీఎఫ్‌లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మధురమైనది మాతృభాష



రాజాం సిటీ: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు

రాజాం సిటీ: పట్టణంతో పాటు మండలంలోని పలు పాఠశాలల్లో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులు మీగడ మల్లికార్జునరావు, వి.దుర్గారావులను సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్ మాట్లాడుతూ.. మాతృభాషను ఎవరూ విస్మరించొద్దని, అందులో ఉండే మాధుర్యం అంతులేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, గట్టి పాపారావు, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: కేజీబీవీలో విద్యార్థినుల ప్రదర్శన

రేగిడి: మండలంలో దేవుదళ కేజీబీవీలో బుధవారం మాతృ భాషాదినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు తెలుగు అక్షర రూపంలో మానవహారంగా ఏర్పడి మాతృభాషపై ఉన్న మమకారాన్ని చాటుకున్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కమిషనర్ జె.రామఅప్పలనాయుడు అన్నారు. పొనుగుటివలస, ఇందిరమ్మకాలనీ సచివాలయాల పరిధిలో ఒక్కొక్క వలంటీర్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. స్థానికంగా ఉన్న యువత ఈ నెల 22 నుంచి 28వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సచివాలయాల్లో సంప్రదించాలన్నారు.

మద్యం బాటిల్స్ స్వాధీనం

సంతకవిటి:మండలపరిధిలోని జీఎస్ పు రం గ్రామంలో బుధవారం అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి 16 బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబు ల్ ఎస్.డి.ప్రసాదరావు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, అమ్మినా తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్‌సీ హెచ్చరించారు.

అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలి

రాజాం: మండలంలో అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేయించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్‌అసిస్టెంట్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వేతనదారులకు రెండు పూటలా పనులు కల్పించాలని, వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం, ఈసీ బి.శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఏపీడీ ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నీకల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా చేపడుతున్న పనులు, పాల్గొంటున్న వేతనదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేతనాల చెల్లింపు, బకాయిలపై ఆరాతీశారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉంచాలన్నారు. రెండు పూటలు పనులు కల్పిస్తే వేతనదారులకు గిట్టుబాటు వేతనం వస్తుందని, ఈ మేరకు వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మర్రాపు సత్యవతి పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలోని యందొర చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఆంజనేయులు బుధవారం తనిఖీ చేశారు. వేతనదారుల మస్తర్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. వేతనదారులకు వందరోజులు పని కల్పించాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు ఏపీఓ విజలక్ష్మి, ఈసీ బుజ్జి, టెక్నికల్ ఉన్నారు.



బాడంగి: ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు



రాజాం: సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

ఉద్యోగులకు న్యాయం చేయాలి

వంగర: ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టిన పార్టీకే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఓటు వేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బి.శ్రీనివాసరావు, బి.చంద్రమౌళి, పి.మురళీ, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం వేలం

బాడంగి: మద్యం కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం వేలం వేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సహాయ సూపరింటెండెంట్ డీవీజీ రాజు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో హీరోహోండా గ్లామర్ బైక్‌ను వేలం వేయగా.. రూ.18 వేలు ఆదాయం వచ్చిందని తెలిపారు. వేలంలో హెచ్‌సీ ఉమామహేస్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

రేగిడి: మండలంలో వెంకంపేట గ్రామానికి చెందిన బానాల భవానీకి బహుజన సమాజ్ పార్టీ ఇన్‌చార్జ్ బొత్స బుద్దుడు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన భవానీ విద్యాభ్యాసానికి తనవంతు సాయంగా రూ.2 వేలు, యూనిఫాం దుస్తులు, పుస్తకాలు అందజేసినట్లు చెప్పారు. దాతలు ముందుకువచ్చి విద్యార్థినికి సాయం అందించాలని కోరారు.

చలో కాకినాడను విజయవంతం చేయాలి

బాడంగి: భారత రాజ్యాంగమే దళితుల ఎజెండాగా పనిచేస్తున్నామని ఉత్తరాంధ్ర జిల్లాల మాలమహానాడు అధ్యక్షుడు ఎండ గోపాలరావు అన్నారు. మండలంలోని గజరాయునివలసలో చలో కాకినాడ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. దళితుల హక్కుల సాధనకు నిర్వహించే కాకినాడ సభలో ఉత్తరాంధ్ర నుంచి వేలాది మంది మాదిగలు పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. ఆయనతో పాటు వై.మోహన్‌గౌతం, వై.వంశీకృష్ణ, పి.సమేల్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తం

రేగిడి: చిన్నారుల ఆరోగ్యంపట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అసిరినాయుడు తెలిపారు. రేగిడి, ఉంగరాడ మెట్ట, కేఎంవలస, చాటాయివలస తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లలకు టీకాలు వేయడం వల్ల కలిగే ఉపయోగాలను తల్లిదండ్రులకు వివరించారు.

చెరుకు పంట దగ్ధం



కాలిపోతున్న చెరుకు తోటలు

బాడంగి: మండలంలోని పిన్నవలసలో సుమారు ఐదెకరాల చెరుకుతోట అగ్నికి ఆహుతయ్యింది. చెరుకుతోట కటింగ్ అనంతరం మరోపంట వేసేందుకు వీలుగా వ్యర్థాలను కాలుస్తుండగా ఆ నిప్పులు గాలికి ఎగిరిపడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నాడు పాపినాయుడు, కృష్ణ, సీతంనాయుడు, శ్రీను, సింహాద్రి, పాటూరు సత్యారావులకు చెందిన సుమారు ఐదు ఎకరాల చెరుకుతోట పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు 110 టన్నుల వరకు చెరుకుపంట కాలిపోయింది. దాని విలువ సుమారు రూ.2.80 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంట ఇలా అగ్నికి ఆహుతవ్వడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు.



